క్లుప్తంగా

ఇంగ్లిష్ లెక్చరర్ పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

యానాం: యానాం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ప్రభుత్వ పాలిటెక్నిక్‌లో ఖాళీగా ఉన్న ఇంగ్లిష్ లెక్చరర్(అవుట్ సోర్సింగ్) పోస్టును స్టాఫ్ గ్యాప్ ఎరేంజ్‌మెంట్ విధానం ద్వారా భర్తీ చేయడానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ వేలాయుధన్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు ఎంఏ(ఇంగ్లిష్) ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణులై ఉండాలన్నారు. ఈ నెల 10వ తేదీ వరకూ దరఖాస్తు చేసుకునేందుకు అవకాశముందని చెప్పారు.

తెలుగు కళామతల్లి ముద్దుబిడ్డ విశ్వనాథ్



విశ్వనాథ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న జిల్లా చేతి వృత్తుల సంఘం ప్రతినిధులు

అమలాపురం టౌన్: దర్శకుడు కె.విశ్వనాథ్ తెలుగు కళామతల్లి ముద్దుబిడ్డ అని జిల్లా చేతి వృత్తుల సంఘం అధ్యక్షుడు దేవాదుల సూర్యనారాయణమూర్తి అన్నారు. స్థానిక కొంకాపల్లిలోని సంఘ కార్యాలయంలో శనివారం విశ్వనాథ్ సంతాప సభ నిర్వహించారు. తొలుత విశ్వనాథ్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గున్నేపల్లి భీమశంకరం, సినీనటుడు డీఎస్ఎన్ కుమార్, సంఘ ప్రతినిధులు మట్టపర్తి సాయిబాబా, కుడుపూడి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

విశ్వనాథ్‌కు చిత్రాంజలి



చంద్రకుమార్ వేసిన దర్శకుడు కె.విశ్వనాథ్ చిత్రం

అమలాపురం రూరల్: సంప్రదాయ విలువలకు, కళలకు ప్రాణం పోసిన మీ సినిమాలు చరిత్రలో చిరస్థాయిగా నిలిచే చిహ్నాలంటూ పాలగుమ్మి జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాల చిత్రలేఖన ఉపాధ్యాయుడు పోలిశెట్టి నరసింహ చంద్రకుమార్ దర్శకుడు కె.విశ్వనాథ్ చిత్రాన్ని కలర్ పెన్సిల్స్‌తో వేశారు. ఈ చిత్రం పలువురిని ఆకట్టుకుంది.

రెండు తాటాకిళ్లు దగ్ధం



మంటలను అదుపు చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

ఐ.పోలవరం: మండలంలోని పాతయింజరం గ్రామంలో శుక్రవారం అర్ధరాత్రి గ్రామానికి చెందిన సలాది చంద్రరావు, పెద్దిరెడ్డి వెంకట్రావులకు చెందిన తాటాకిళ్లు ప్రమాదవశాత్తూ అగ్నికి ఆహుతయ్యాయి. స్థానికులు గుర్తించి సమాచారమివ్వడంతో ముమ్మిడివరం అగ్నిమాపక సిబ్బంది వచ్చి పూర్తిస్థాయిలో మంటలు అదుపు చేశారు. ప్రమాదానికి కారణాలు తెలియాల్సి ఉంది. ప్రమాదంలో ఆస్తి నష్టం సుమారు రూ.2 లక్షల వరకూ ఉంటుందని అధికారులు అంచనా వేస్తున్నారు.

శివారు భూములకు సాగు నీరందించాలి

తాళ్లరేవు: మండల పరిధిలోని శివారు భూములకు సాగునీటిని పూర్తిస్థాయిలో అందించాలని ఆంధ్రప్రదేశ్ కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి వల్లు రాజబాబు డిమాండ్ చేశారు. పి.మల్లవరం పంచాయతీలో నీరులేక ఎండిపోతున్న వరి చేలను సంఘ సభ్యులు పరిశీలించారు. ఈ సందర్భంగా రాజబాబు మాట్లాడుతూ ఏటా ఐదు గ్రామాల్లో సాగునీటి ఎద్దడి ఏర్పడుతుందని, దాళ్వాలో నీరందక పంటలు సరిగా పండటం లేదన్నారు. ఇరిగేషన్ అధికారులు స్పందించి సాగునీటి సమస్య లేకుండా చేయాలని కోరారు.

ఉప్పలగుప్తం: సాగు చేసిన వరి చేలకు నీరందేలా అధికారులు కృషి చేయాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం ఉపాధ్యక్షుడు కారెం వెంకటేశ్వరరావు విజ్ఞప్తి చేశారు. స్థానిక గ్రామంలోని శివారు ప్రాంతాలైన పేరాయిచెరువు, ఆదిలక్ష్మీపురం ప్రాంతాల్లో శనివారం ఆయన పర్యటించి వరి చేలను పరిశీలించారు. ఈ ప్రాంతంలో సాగు నీరందక రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, పంట కాలువలో పూడికలు తీయించాలని కోరారు. కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి పీతల రామచంద్రరావు, కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి పి.వసంత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వేద పండితుల గోష్ఠి

అమలాపురం టౌన్: అమలాపురం కోనసీమ వేద శాస్త్ర సన్మాన సభ, రాజమహేంద్రవరం గౌతమీ వ్యాక్యార్థ సభ సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక కోనసీమ శంకరమఠ ప్రాంగణంలో వేద పండితుల గోష్ఠి శుక్రవారం సాయంత్రం నుంచి రాత్రి వరకూ సాగింది. మహామహోపాధ్యాయ, శ్రీరామాయణ తత్వజ్ఞ చిర్రావూరి శ్రీరామశర్మ అధ్యక్షతన జరిగిన గోష్ఠిలో రామాయణాంతర్గత ఆధ్యాత్మిక ప్రసంగం, వాక్యార్థ శాస్త్రంపై చర్చ నిర్వహించారు. కార్యక్రమంలో శ్రీకోనసీమ వేద శాస్త్ర సన్మాన సభ అధ్యక్ష, కార్యదర్శులు గుళ్లపల్లి ప్రభాకర ఫణి రాజా, గుళ్లపల్లి వెంకట్రామ్, లక్ష్మీప్రసన్నాంజనేయశర్మ(పాండిచ్చేరి), కుప్పా బిల్వేశ్వర శాస్త్రి(వారణాసి), జి.దత్తాత్రేయమూర్తి(పూరి), నోరి కేదారేశ్వరశర్మ(తెనాలి), రామ సోమయాజులు(రాజమహేంద్రవరం) పాల్గొన్నారు.

పేదరికం లేని సమాజమే సీఎం లక్ష్యం

- ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్
- ముమ్మిడివరం నగర పంచాయతీలో గడపగడపకూ..



ముమ్మిడివరంలో స్థానికులకు సంక్షేమ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్

ముమ్మిడివరం: పేదరికం లేని సమాజం నిర్మించడమే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ అన్నారు. నగర పంచాయతీ 14, 15 వార్డులలో భవానీ పేట, క్రాపచింతలపూడి, రాయుడుపాలెం గ్రామాల్లో శనివారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. నగర పంచాయతీ చైర్మన్ కమిడి ప్రవీణ్‌కుమార్, వైస్ చైర్మన్ వేటుకూరి బోసురాజు, కౌన్సిలర్ సరిపెల్ల రామకృష్ణంరాజు తదితరులతో కలిసి చేసిన పర్యటనకు విశేష స్పందన లభించింది. ఇంటింటికీ వెళ్లి గత మూడున్నరేళ్లలో ప్రభుత్వం ద్వారా ఆయా కుటుంబాలకు అందిన సంక్షేమ లబ్ధిని వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదల అభ్యున్నతి కోసం జగనన్న అహర్నిశలు పాటు పడుతున్నారన్నారు. ఇంటివద్దకే పాలన తీసుకొచ్చి నేరుగా లబ్ధిదారులకు పథకాలు అందజేస్తున్నారని చెప్పారు. గతంలో ఏ ప్రభుత్వం ఇలాంటి పాలన సాగించలేదని కొనియాడారు. గతంలో సిఫార్సులు ఉంటేనే ప్రభుత్వ పథకాలు వచ్చేవని, జగనన్న ప్రభుత్వంలో అర్హత ఉంటే చాలు ఇంటి వద్దకే పథకాలు చేరుతున్నాయని చెప్పారు. ప్రతి నెలా 1వ తేదిన పింఛన్ అందజేయడమే అందుకు నిదర్శనమన్నారు. సచివాలయ వ్యవస్థతో ప్రజలకు స్థానికంగా మెరుగైన సేవలు అందుతున్నాయన్నారు. ఇంత మేలు చేస్తున్న సీఎం జగనన్నకు అందరూ అండగా నిలబడి మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శులు పెన్మత్స చిట్టిరాజు, పెయ్యల చిట్టిబాబు, వేగిరౌతు రాజబాబు, హితకారిణి సమాజం చైర్‌పర్సన్ కాశి బాలమునికుమారి, జెడ్పీటీసీ కుడిపూడి శంకరరావు, కోలా బాబ్జీ, టౌన్ కన్వీనర్ బొంతు సత్యశ్రీనివాస్, మండల పార్టీ కన్వీనర్ జగతా పద్మనాభం, కమిషనర్ జి.లోవరాజు, రెడ్డి శివన్నారాయణ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం

తాళ్లరేవు: తీర ప్రాంత మండలమైన తాళ్లరేవులో తాగునీటి సమస్య శాశ్వత నివారణకు చర్యలు చేపట్టినట్లు ముమ్మిడివరం ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ తెలిపారు. శనివారం తాళ్లరేవు కుళాయి చెరువు ఆవరణలో ఓఎన్జీసీ నిధులు రూ.2.60 కోట్లతో నిర్మించనున్న ఫిల్టర్ బెడ్ నిర్మాణానికి ఎమ్మెల్యే పొన్నాడ శంకుస్థాపన చేశారు. అనంతరం స్థానిక సర్పంచ్ రెడ్డి అరుణ సుహాసినీదేవి అధ్యక్షతన జరిగిన సభలో ఎమ్మెల్యే పొన్నాడ మాట్లాడుతూ కరోనా కారణంగా ఆర్థిక ఇబ్బందులున్నా నియోజకవర్గంలో ఓఎన్జీసీ నిధులు రూ.30 కోట్లతో 80 తాగునీటి ట్యాంకుల నిర్మాణం చేపట్టామన్నారు. తాళ్లరేవు మండలంలో అత్యధికంగా రూ.11 కోట్లు వెచ్చించి 30 ట్యాంకులను నిర్మిస్తున్నట్లు తెలిపారు. ఆయా ట్యాంకులకు నీటిని సరఫరా చేసేందుకుగానూ నిర్మాణం చేస్తున్న ఫిల్టర్ బెడ్ ద్వారా తాళ్లరేవు, పోలేకుర్రు, సీతారామపురం గ్రామాలకు రోజుకు 40 లక్షల లీటర్ల నీటిని సరఫరా చేస్తారన్నారు. జలజీవన్ మిషన్ ద్వారా మండలానికి రూ.24 కోట్లు మంజూరయ్యాయని, వీటి ద్వారా ఇంటింటికీ కుళాయి సౌకర్యం కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ రాయుడు సునీత, జెడ్పీటీసీ సభ్యులు దొమ్మేటి సామ్యూల్ సాగర్, రాష్ట్ర నేతలు దున్నా జనార్దనరావు, కుడుపూడి శివన్నారాయణ, పార్టీ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కాద గోవిందకుమార్, రాయుడు గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

రైల్వే లైన్‌కు నిధుల కేటాయింపుపై హర్షం



సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు చిట్టిబాబు

అమలాపురం రూరల్: కేంద్ర ప్రభుత్వం కోటిపల్లి–నరసాపురం రైల్వే లైన్‌కి రూ.100 కోట్లు కేటాయించడంపై బీజేపీ జిల్లా అధ్యక్షుడు కర్రి చిట్టిబాబు హర్షం వ్యక్తం చేశారు. శనివారం అమలాపురంలోని పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో చిట్టిబాబు మాట్లాడుతూ కేంద్రం రాష్ట్రాన్ని అన్ని విధాలుగా ఆదుకుంటుందని త్వరలోనే కోటిపల్లి-నరసాపురం రైల్వే లైన్ ప్రజలకు అందుబాటులోకి వస్తుందన్నారు. కొన్ని పార్టీలు పనిగట్టుకుని తప్పుడు ప్రచారం చేస్తూ రైల్వే లైన్ ఆగిపోయిందని పుకార్లు పుట్టిస్తున్నాయని, అటువంటివి నమ్మొద్దని కోరారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మోకా వెంకట సుబ్బారావు, ఎస్సీ మోర్చా జోనల్ ఇన్చార్జి దూరి రాజేష్, జిల్లా ఉపాధ్యక్షుడు అరిగెల వెంకట రామారావు, యువ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి కొండేటి ఈశ్వర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

రైల్వే లైన్‌కు రూ.100 కోట్లు సరిపోవు

అమలాపురం టౌన్: రైల్వే బడ్జెట్‌లో కోటిపల్లి–నర్సాపురం లైన్‌కు కేటాయించిన రూ.100 కోట్లు ప్రస్తుత పరిస్థితుల్లో ఏమాత్రం సరిపోవని కోనసీమ రైల్వే సాధన సమితి(కేఆర్ఎస్ఎస్) కన్వీనర్ డాక్టర్ ఈఆర్ సుబ్రహ్మణ్యం అభిప్రాయపడ్డారు. ప్రస్తుతం నత్తనడకన నడుస్తున్న లైన్ నిర్మాణ పనులకు ఈ నిధులు కొంతమేరే ఉపయోగపడతాయని చెప్పారు. అయితే కోనసీమ రైల్వే లైన్‌కు కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో రూ.100 కోట్లు కేటాయించి గుర్తింపు ఇవ్వడం అభినందనీయమని తెలిపారు. కోనసీమ రైల్వే లైన్‌కు నిధుల కోసం కృషి చేస్తున్న ఆర్ఎస్ఎస్ నేత వారణాసి వేణుమాధవ్‌కు కేఆర్ఎస్ఎస్ తరపున కృతజ్ఞతలు తెలిపారు. బడ్జెట్‌లో నిధుల కేటాయింపుపై కేఆర్ఎస్ఎస్ మిశ్రమ స్పందన ప్రకటిస్తూనే కేంద్ర ప్రభుత్వానికి తమ హర్షాన్ని తెలియజేసింది. కేఆర్ఎస్ఎస్ ప్రతినిధులు కల్వకొలను తాతాజీ, కుడుపూడి సూర్యనారాయణరావు, సప్పా నాగేశ్వరరావు, ఉప్పుగంటి భాస్కరరావు, పోలిశెట్టి శివాజీ తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

కరెన్సీ నోట్లపై అంబేడ్కర్ చిత్రాన్ని ముద్రించాలి

అమలాపురం టౌన్: కరెన్సీ నోట్లపై డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఫొటో సాధన సమితి జాతీయ కమిటీ అధ్యక్షుడు డాక్టర్ జె.పరుశురామ్ ఆధ్వర్యంలో ఈ నెల 1వ తేదీన విశాఖపట్టణం నుంచి మొదలైన ప్రజా పోరు యాత్ర శనివారం సాయంత్రం అమలాపురం గడియార స్తంభం చేరుకుంది. యాత్రకు స్థానిక బుద్ధ విహార్ వద్ద స్థానిక నాయకులు స్వాగతం పలికారు. వీఎస్‌కే జిల్లా అధ్యక్షుడు బొంతు రమణ, న్యాయవాది యాళ్ల దొరబాబు, బీఎస్పీ నాయకుడు జిత్తుక సత్యనారాయణ తదితరులు స్వాగతం పలికి కరెన్సీపై అంబేడ్కర్ ఫొటో ముద్రించాలని నినాదాలు చేశారు. కమిటీ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ పరశురామ్ మాట్లాడుతూ తన పోరు యాత్ర ఢిల్లీ వరకూ కొనసాగుతుందని తెలిపారు.

యానాం ఎస్సీ సమస్యలను పరిష్కరించాలి



పుదుచ్చేరి మంత్రి చంద్రప్రియాంకకు వినతిపత్రం అందిస్తున్న సిద్ధార్థకుమార్

యానాం: యానాం నియోజకవర్గ పరిధిలో షెడ్యూల్డ్ కులాల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ శనివారం పుదుచ్చేరి సంక్షేమశాఖ మంత్రి చంద్ర ప్రియాంకకు యానాం ఎస్సీ, ఎస్టీ సంక్షేమ సంఘ అధ్యక్షుడు పండు సిద్ధార్థ కుమార్ వినతి పత్రం అందజేశారు. పుదుచ్చేరిలో అన్నమాలై హోటల్‌లో ఆది ద్రావిడ శాఖ ద్వారా అమలవుతున్న పథకాల నిధులపై ఎస్సీ, ఎస్టీ సంఘాలతో సోషల్ ఆడిట్ సమావేశం మంత్రి చంద్రప్రియాంక అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ స్పెషల్ కాంపోనెంట్ నిధులు మురిగిపోతున్నాయని వాటిని ఎస్సీల అభివృద్ధికే ఉపయోగించాలన్నారు. యానాంలో ఏళ్ల క్రితం రూ.35 వేలతో నిర్మించిన గృహాలు శిథిలస్థితికి చేరుకున్నాయని, పునర్నిర్మాణానికి రూ.5 లక్షల ఉచిత స్కీమ్‌ను వర్తింపజేయాలని కోరారు. భూమిలేని వారికి ఎల్జీఆర్ పట్టాలివ్వాలని, ఎస్సీ నిధులతో నిర్మాణం చేసిన కల్యాణమండపాలు, కమ్యూనిటీ హాళ్ల నిర్వహణను ఆదిద్రావిడ శాఖకు ఇవ్వాలని విన్నవించారు. కార్యక్రమంలో వెల్ఫేర్ సెక్రటరీ కేశవన్, ఆదిద్రావిడ డైరెక్టర్ అశోకన్, ఎండీ దయాలన్, జీఎం ఆర్ముగం తదితరులు పాల్గొన్నారు.

సారా విక్రేతలకు పునరావాస చర్యలు



తాళ్లరేవులో భవానీ ప్రారంభించిన దుకాణాన్ని పరిశీలిస్తున్న ఎస్ఈబీ సీఐ భవానీ

తాళ్లరేవు: సారా విక్రేతలను మంచి దారిలో పెట్టేందుకు ప్రభుత్వం వారికి వివిధ జీవనోపాధులను కల్పిస్తుందని తాళ్లరేవు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో సీఐ జేవీ భవానీ తెలిపారు. స్థానిక పెంకేవారి పేటలో సారా విక్రయించే పెంకే భవానీకి పునరావాస చర్యల్లో భాగంగా జీవనోపాధి కల్పించేందుకు ప్రభుత్వం రూ.1 లక్ష ఆర్థిక సహాయాన్ని మంజూరు చేసిందని తెలిపారు. ఈ చెక్కును ఇటీవల జిల్లా కలెక్టర్ కృతికాశుక్లా, ఎస్పీ రవీంద్రనాథ్‌బాబులు భవానీకి అందజేశారన్నారు. ఈ మేరకు ఆమె ప్రారంభించిన దుకాణాన్ని సీఐ భవానీ, ఎస్ఐ ఎం.కుమార్‌లు పరిశీలించారు. దుకాణం ఏర్పాటు ద్వారా వచ్చే డబ్బులతో జీవనం సాగిస్తూ పిల్లలను బాగా చదివించుకుంటానని భవానీ తెలిపింది.

మహిళా సమస్యలపై ఐద్వా స్టడీ సర్కిల్



స్టడీ సర్కిల్‌లో మాట్లాడుతున్న ఐద్వా నాయకులు

అమలాపురం టౌన్: ఐద్వా ఆధ్వర్యంలో స్థానిక యూటీఎఫ్ హోమ్‌లో మహిళా సమస్యలపై స్టడీ సర్కిల్ కార్యక్రమం శనివారం సాయంత్రం జరిగింది. ఐద్వా జిల్లా అధ్యక్షురాలు ఎండీ హమీదా అధ్యక్షతన జరిగిన ఈ స్టడీ సర్కిల్‌లో పలు చోట్ల పనిచేస్తున్న మహిళలు పాల్గొన్నారు. తాము పని చేసే చోట మరుగుదొడ్లు ఉండడం లేదని కొందరు మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు. స్టడీ సర్కిల్‌కి వచ్చిన మహిళల సమస్యలను జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని ఐద్వా జిల్లా కార్యదర్శి టి.నాగ వరలక్ష్మి అన్నారు. కార్యక్రమంలో కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి పి.వసంతకుమార్, ఐద్వా నాయకురాలు కె.రాఘవమ్మ, సీహెచ్ లోవలక్ష్మి, ఎం.చంద్ర, సీహెచ్ దేవి తదితరులు పాల్గొన్నారు.

చైన్ స్నాచర్లకు దేహశుద్ధి



పట్టుబడిన చైన్ స్నాచర్లు

ఐ.పోలవరం: నడిచి వెళ్తున్న మహిళ మెడలో ఆరున్నర కాసుల బంగారు తాడు, సూత్రాలు, గొలుసును తెంచి ఎత్తుకెళ్లేందుకు ప్రయత్నించిన చైన్ స్నాచర్లకు స్థానికులు దేహశుద్ధి చేశారు. ఐ.పోలవరంలో ఈ ఘటన జరిగింది. ఉలిసి వీర వెంకట సత్యవతి అనే మహిళ శుక్రవారం రాత్రి పది గంటల సమయంలో పక్కింటికి వెళ్తోంది. అదే సమయంలో ముగ్గురు దుండగులు మోటార్ సైకిల్‌పై వచ్చి ఈ దారి ఎటువైపు వెళ్తుందని అడిగారు. అంతలోనే మరో వ్యక్తి సత్యవతి మెడలోని బంగారు ఆభరణాలు లాక్కున్నాడు. అనంతరం ముగ్గురూ బైక్‌పై ఉడాయించారు. అయితే అప్రమత్తమైన సత్యవతి ఒక్కసారిగా కేకలు వేయడంతో చైన్ స్నాచర్లను స్థానికులు వెంబడించారు. ముగ్గురిలో ఇద్దరు పట్టుబడగా దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. మరో వ్యక్తి బైక్‌పై పరారయ్యాడు. పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

రోడ్డు నిర్మాణానికి రూ.23 లక్షల నిధులు



ఎంపీ అనురాధని కలిసిన సన్నవిల్లి గ్రామస్తులు

అల్లవరం: సన్నవిల్లి పంచాయతీ పరిధిలోని గున్నాలపేట రాంజీనగర్ కాలనీలో రోడ్డు నిర్మాణానికి రూ.23 లక్షల నిధులు కేటాయించారని ఎంపీ చింతా అనురాధ శనివారం తెలిపారు. మొగళ్ళమూరులోని ఎంపీ కార్యాలయంలో సన్నవిల్లి గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు ఎంపీ అనురాధని శనివారం మర్యాద పూర్వకంగా కలిశారు. రోడ్డు నిర్మాణానికి నిధులు కేటాయించిన ఎంపీకి కృతజ్ఞతలు తెలిపారు. ఎంపీని కలిసినవారిలో వైఎస్సార్ హార్టీకల్చర్ యూనివర్సిటీ బోర్డు సభ్యులు జున్నూరి వెంకటేశ్వరరావు, ఎంపీటీసీ వంగా గిరిజాకుమారి, వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి నిమ్మకాయల హనుమంత శ్రీనివాసరావు, గనిశెట్టి సద్గురు తదితరులున్నారు.

దొరబాబును పరామర్శించిన మంత్రి, ఎంపీ



దొరబాబుని పరామర్శిస్తున్న మంత్రి విశ్వరూప్

అల్లవరం: ఇటీవల స్వల్ప అస్వస్థతకు గురైన బీజేపీ కార్యదర్శి యాళ్ల దొరబాబుని రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్, ఎంపీ అనురాధ శనివారం పరామర్శించారు. బెండమూర్లంకలోని తన నివాసంలో విశ్రాంతి తీసుకుంటున్న దొరబాబు ఆరోగ్యంపై మంత్రి, ఎంపీ ఆరా తీశారు. ఎంపీపీ ఇళ్ల శేషగిరిరావు, మండల పార్టీ అధ్యక్షుడు కొనుకు బాపూజీ, బీజేపీ నాయకులు పరామర్శించినవారిలో ఉన్నారు.

వన్నె చింతలపూడిలో ఆయుర్వేద శిబిరం



శిబిరంలో మందులు పంపిణీ చేస్తున్న సర్పంచ్ నక్కా రాజారత్న

అమలాపురం రూరల్: వన్నె చింతలపూడిలో క్షత్రియ సేవా సమితి, నడింపల్లి రామరాజు ఆధ్వర్యంలో ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరాన్ని శనివారం నిర్వహించారు. అమలాపురం తహసీల్దార్ పరమట పల్లవి వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. శిబిరంలో రోగుల్ని పరీక్షించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ నక్కా రాజారత్న నాగవాణి, ఎంపీటీసీ సభ్యులు పరమట నాగమణి, సామాజిక వేత్త పచ్చిమాల బాబ్జి, ఉప సర్పంచ్ యర్రంశెట్టి వీరభద్రరావు, మాజీ సర్పంచ్ కలిదండి సీతాపతి రాజు తదితరులు పాల్గొన్నారు.

స్టడీ అవర్స్‌లో విద్యార్థులకు అల్పాహారం



విద్యార్థులకు అల్పాహారం అందిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ సత్య నాగేంద్రమణి, కమిషనర్ నాయుడు

అమలాపురం టౌన్: పట్టణంలోని జవహర్‌లాల్ నెహ్రూ, మహాత్మాగాంధీ మున్సిపల్ ఉన్నత పాఠశాలల్లో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు ప్రతి రోజు సాయంత్రం 4 గంటల నుంచి 5.30 గంటల వరకూ జరిగే స్టడీ అవర్స్‌లో అల్పాహారం(స్నాక్స్) అందించే కార్యక్రమం శనివారం సాయంత్రం నుంచి ప్రారంభమైంది. స్థానిక కొంకాపల్లి మున్సిపల్ ఉన్నత పాఠశాలలో ఈ కార్యక్రమాన్ని చైర్‌పర్సన్ రెడ్డి సత్య నాగేంద్రమణి, కమిషనర్ ఒమ్మి అయ్యప్పనాయుడు, కౌన్సిలర్ తిక్కా సత్య లక్ష్మి ప్రారంభించారు. మున్సిపాలిటీ ఆధ్వర్యంలో విద్యార్థులకు పదో తరగతి పరీక్షలు అయ్యే వరకూ అల్పాహారాన్ని రోజూ అందించనున్నట్లుగా తెలిపారు. గత నెల 27న జరిగిన కౌన్సిల్ సమావేశంలో పలువురు కౌన్సిలర్లు చేసిన ఈ ప్రతిపాదనను కమిషనర్ నాయుడు అమల్లోకి తీసుకొచ్చారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కె.ఘన సత్యనారాయణ, పాఠశాల కమిటీ చైర్మన్ మంచిగంటి వెంకటేశ్వరరావు, వైస్ చైర్‌పర్సన్ బోడే భారతి, రెడ్డి సత్యనారాయణ, తిక్కా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నేడు మండపేటలో ఎస్‌టీయూ జిల్లా కౌన్సిల్

అమలాపురం రూరల్: రాష్ట్రోపాధ్యాయ సంఘం(ఎస్‌టీయూ) కోనసీమ జిల్లా మధ్యంతర కౌన్సిల్ సమావేశం మండపేటలోని సీతారామ కమ్యూనిటీ హాలులో ఆదివారం ఉదయం 9 గంటలకు జరుగుతుందని అమలాపురం మండల శాఖ అధ్యక్షుడు నల్లా రామకృష్ణ, ప్రధాన కార్యదర్శి కేతా శ్రీనివాసరావు తెలిపారు. కౌన్సిల్‌కు రవాణా శాఖా మంత్రి విశ్వరూప్, రాష్ట్ర అధ్యక్షుడు లంకలపల్లి సాయి శ్రీనివాస్, ఎమ్మెల్యే వేగుళ్ళ జోగుశ్వరరావు, డీఈఓ రవిసాగర్ తదితరులు పాల్గొంటారన్నారు.

బులియన్ అధ్యక్షుడు త్రిమూర్తులుకు సత్కారం

అమలాపురం టౌన్: అమలాపురం బులియన్ అసోసియేషన్ నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన మేడిచర్ల త్రిమూర్తులును జనసేన నాయకులు స్థానిక దేవాంగ వీధిలో శనివారం సాయంత్రం సత్కరించి అభినందించారు. మూడో వార్డు మున్సిపల్ కౌన్సిలర్ యేడిద శ్రీను, యాళ్ల బాబి, దున్నాల వేణు, అడపా వెంకటేశ్వరావు తదితరులు త్రిమూర్తులను సత్కరించారు.

ప్రకృతి వైద్యం, యోగా సెంటర్ ప్రారంభం

యానాం: నియోజకవర్గ పరిధిలోని యూకేవీ నగర్‌లో శనివారం ఆయుష్, హెల్త్ అండ్ వెల్‌నెస్ ఆధ్వర్యంలో ప్రకృతి వైద్యం, యోగా సెంటర్‌ను వైద్యురాలు డాక్టర్ డి.చంద్రలక్ష్మి, ఆయుర్వేద వైద్యనిపుణులు డాక్టర్ పురుషోత్తం ప్రారంభించారు. డాక్టర్ చంద్రలక్ష్మి మాట్లాడుతూ ప్రకృతివైద్యం ద్వారా అధిక రక్తపోటు, మధుమేహం, స్త్రీల వ్యాధుల గురించి వివరించారు. ప్రతి నెలా మొదటి, మూడో శుక్రవారాల్లో ప్రకృతి వైద్యం(నేచురోపతి), యోగా క్యాంప్ ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో ఆశావర్కర్లు కె.లోవతల్లి, ఎల్.లోవతల్లి పాల్గొన్నారు.

బస్సు దగ్ధం



దగ్ధమైన బస్సు

ముమ్మిడివరం: ఓ ప్రైవేటు ట్రావెల్స్ బస్సు దగ్ధమైన ఘటన అనాతవరం వద్ద చోటు చేసుకుంది. ఉప్పలగుప్తం గ్రామానికి చెందిన ఎస్ఆర్ ట్రావెల్స్ బస్సు పిఠాపురంలో ప్రయాణికులను దించి, శుక్రవారం అర్ధరాత్రి తిరిగి వస్తోంది. అనాతవరం సెంటర్ వద్దకు వచ్చేసరికి షార్ట్ సర్క్యూట్ కారణంగా ఇంజిన్ నుంచి మంటలు చెలరేగాయి. ప్రమాదాన్ని గమనించిన డ్రైవర్ అనసూరి లోవకుమార్ బస్సులో నుంచి కిందకు దూకేశాడు. ప్రమాద సమయానికి బస్సులో డ్రైవర్ తప్ప ఎవ్వరూ లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. అగ్నిమాపక అధికారి కేవీఎం కొండబాబు ఆధ్వర్యాన సిబ్బంది మంటలను అదుపు చేశారు. ఎస్సై కె.సురేష్‌బాబు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

బాధిత కుటుంబాలకు దాట్ల పరామర్శ

తాళ్లరేవు: మండలంలోని పలు గ్రామాల్లో బాధిత కుటుంబాలను ముమ్మిడివరం మాజీ ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు పరామర్శించి ఓదార్చారు. జైభీమ్‌పేట, రంగనాయకపురం, ఇంజరం, పెదగోవలంక గ్రామాల్లో గాదిరాజు పార్వతి, జక్కల నాగరత్నం, సంగాడి రాంబాబు, కాపూరి దుర్గారావు కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట తెలుగు యువత రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి ధూళిపూడి వెంకట రమణ, టి.లక్ష్మణరావు, జక్కల ప్రసాద్ తదితరులున్నారు.

గాడిలంకలో పొలంబడి



పొలంబడి కార్యక్రమం నిర్వహిస్తున్న వ్యవసాయాధికారులు

ముమ్మిడివరం: ఆరోగ్యకరమైన పంటను పండించి తక్కువ పెట్టుబడితో ఎక్కువ దిగుబడి సాధించడమే పొలంబడి కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని మండల వ్యవసాయాధికారి ఎస్.ప్రశాంత్‌కుమార్ పేర్కొన్నారు. మండలంలోని గాడిలంకలో శనివారం పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ఎరువులు, పురుగు మందులు అవసరమైన మేరకు వాడి అధిక దిగుబడులు సాధించాలన్నారు. రబీలో అక్కడక్కడా తెగుళ్ల వ్యాప్తి చెందుతున్నాయని, వాటి నివారణకు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో అగ్రికల్చర్ అసిస్టెంట్ బలరామ్, వ్యవసాయశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

సమైక్యంగా అభివృద్ధికి కృషి



నామినేటెడ్ ఎమ్మెల్యే అంగలన్ పుట్టినరోజు వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే అశోక్

యానాం: పుదుచ్చేరిలోని నాలుగు ప్రాంతాలైన యానాం, మాహే, కారైకల్, పుదుచ్చేరిల అభివృద్ధే ధ్యేయంగా సమైక్యంగా కృషి చేస్తున్నట్లు పలువురు బీజేపీ ఎమ్మెల్యేలు, ఇండిపెండెంట్ ఎమ్మెల్యేలు పేర్కొన్నారు. శనివారం బీజేపీ నామినేటెడ్ సభ్యుడు అంగలన్ పుట్టినరోజు వేడుకల్లో స్పీకర్ ఆర్ సెల్వం, పార్లమెంటరీ కార్యదర్శి రిచర్డ్ జాన్‌కుమార్, యానాం ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్, శివశంకర్, కల్యాణసుందరం, అశోక్‌బాబు, జయకుమార్ రెడియార్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రజలకు అభివృద్ధి, సంక్షేమ పథకాలను వేగవంతంగా అమలు చేసేలా కృషిచేస్తున్నట్లు చెప్పారు.

820 మంది పెన్షనర్ల ఈ-కేవైసీ పరిశీలన

అమలాపురం టౌన్: అమలాపురం డివిజనల్ సబ్ ట్రెజరీ పరిధిలో ఇప్పటివరకూ హెర్బ్ యాప్‌లో పెన్షనర్స్ లాగిన్‌లో అప్‌లోడ్ చేసుకున్న 820 మంది స్టేట్ గవర్నమెంట్ పెన్షనర్ల ఈ–కేవైసీలు పరిశీలించి వాటిని అప్రూవల్ చేశామని ఏటీవో ఆర్.రంగారావు పేర్కొన్నారు. జిల్లా పెన్షనర్ల అసోసియేషన్ అధ్యక్షుడు ఎం.సాయివర ప్రసాద్, ప్రధాన కార్యదర్శి కేకేవీ నాయుడు, కోశాధికారి జయంతి శర్మ, ఉపాధ్యక్షుడు ఎంఅప్పారావులతో కూడిన పెన్షనర్ల బృందం ఏటీవో రంగారావు, ఎస్టీవో వై.వెంకట నారాయణను శనివారం కలిసి పెన్షనర్ల ఈ–కేవైసీ ప్రగతి గురించి చర్చించింది. అమలాపురం ఏవీఆర్ నగర్‌లోని జిల్లా పెన్షనర్ల అసోసియేషన్ భవనంలో పెన్షనర్లకు యాన్యువల్ వెరిఫికేషన్ ధ్రువపత్రాలను, ఈ–కేవైసీ అప్‌లోడ్ చేసే ప్రక్రియను అందుబాటులో ఉంచడంపై జిల్లా అసోసియేషన్‌ను ఏటీవో, ఎస్టీవోలు అభినందించారు.

ఉత్సాహంగా యువజన క్రీడలు



విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఆర్ఏఓ మునిస్వామి, ఎస్పీ రఘునాయగం

యానాం: యానాం నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో శనివారం స్థానిక బాలయోగి క్రీడా మైదానంలో యువజన క్రీడలు ఉత్సాహంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఫుట్‌బాల్, బాస్కెట్‌బాల్, కబడ్డీ, అథ్లెటిక్స్ క్రీడా పోటీలు హోరాహోరీగా జరిగాయి. అనంతరం నిర్వహించిన బహుమతి ప్రధానోత్సవానికి ఆర్ఏఓ మునిస్వామి, ఎస్పీ రఘునాయగం, ఎన్‌వైకే కోఆర్డినేటర్ తిర్రి గోపి తదితరులు పాల్గొన్నారు.

రూ.వెయ్యి పథకానికి 616 మంది ఎంపిక

యానాం: యానాం నియోజకవర్గంలో దారిద్ర్యరేఖకు దిగువనున్న(బీపీఎల్) కుటుంబాల్లోని మహిళా యజమానికి ప్రతి నెలా రూ.1000 సహాయం అందించే పథకానికి 616 మంది మొదటివిడతగా ఎంపికయ్యారని ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు ఎంపిక జాబితాను విడుదల చేసినట్లు తెలిపారు. మహిళా, శిశు అభివృద్ధి శాఖ ద్వారా ఎరుపు రంగు రేషన్ కార్డుదారులకు సైతం ఈ సహాయాన్ని అందిస్తున్నట్లు తెలిపారు. ఎంపికైన లబ్ధిదారులకు సోమవారం నుంచి బ్యాంకు ఖాతాల్లో సొమ్ము జమవుతుందని చెప్పారు. ఎంపికలో ప్రాధాన్యత కల్పించినందుకు గాను ఎల్జీ తమిళిసై సౌందరాజన్, సీఎం రంగసామికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

బోడసకుర్రుకు సీఎస్ఆర్ నిధులు కేటాయించండి

అల్లవరం: బోడసకుర్రు పంచాయతీ పరిధిలో చమురు కార్యాకలాపాలు నిర్వహిస్తున్న చమురు సంస్థలు తమ గ్రామానికి సీఎస్ఆర్ నిధులు కేటాయించాలని సర్పంచ్ రొక్కాల విజయలక్ష్మి, రాజమండ్రి ఓఎన్జీసీ ఈడీ అమిత్ నారాయణ్‌ను కోరారు. బోడసకుర్రు ఓఎన్జీసీ టెర్మినల్ సందర్శనకు వచ్చిన ఈడీని సర్పంచ్ మర్యాదపూర్వకంగా శనివారం కలిశారు. గ్రామంలో చమురు కార్యాకలాపాలు నిర్వహిస్తున్న ఓఎన్జీసీ, గెయిల్ సంస్థలు సీఎస్ఆర్ నిధులు కేటాయించి, గ్రామాభివృద్ధికి తోడ్పాటుని ఇవ్వాలని కోరారు.